# వెహికిల్

## ఎస్. రమాదేవి

'వంకాయకూర అదిరిపోయింది.' లొట్టలు వేస్తూ సుందరివైపు తన్మయంగా చూసి అన్నాడు సుగుణాకర్.

"ఉండక చస్తుందా? పొద్దున్నే మార్కెట్‌కెళ్ళి ఫ్రెష్‌గా పట్టుకొచ్చినవాయే" మూతి మూడు వంకరలు తిప్పుతూ అంది సుందరి.

"అరే నువ్వు ప్రొద్దున్నే మార్కెట్‌కెళ్ళి కూరలు తెచ్చావా? మార్నింగ్ వాక్ ఆరోగ్యానికి చాలా మంచిది సుందరి! అయినా అంత దూరం అవసరం లేదులే— ఏదో పక్క సందు చివర్లో కిరాణా కొట్టు దాకానో, ఇటు పక్కనున్న షాపింగ్ కాంప్లెక్స్ దాకానో వెళ్ళివస్తే చాలనుకుంటా!" తాపీగా చెప్పాడు.

"చాల్లెండి! నా జన్మకు మార్కెట్ దాకా వెళ్ళి తాజా కూరలు తెచ్చుకునే అదృష్టం కూడానా? పక్కింటి విశాలా వాళ్ళాయనా 'స్కూటర్' మీద మార్కెట్‌కు వెళ్ళి వారానికి సరిపడా కూరలు తెచ్చుకుంటారు కదా! అందులోవే నాలుగు వంకాయలు మనకు ఇచ్చారు!" 'స్కూటర్' అన్న మాటను నొక్కిపలుకుతూ అంది సుందరి.

గతుక్కుమన్నాడు సుగుణాకర్. ఈ మధ్య ఏం మాట్లాడినా చివరికి అది స్కూటర్ టాపిక్‌లోకి వెళ్ళడం గమనిస్తూనే ఉన్నాడతను. మొన్నటికి మొన్న అంతే. తన కొలీగ్ వాళ్ళబ్బాయి మొదటి పుట్టినరోజని ఆఫీస్‌లో అందర్నీ పిలిచాడు. తనెంతో ఇదిగా సుందర్ని తీసుకుని వెళ్దామని వస్తే కేవలం వెహికిల్ లేని కారణంగా సుందరి రావడానికి ససేమిరా ఒప్పుకోలేదు. అక్కడికి అందరూ భర్తలూ విత్ భార్యలూ అండ్ పిల్లలూ ఓన్ వెహికిల్స్ మీద ట్రిమ్‌గా వస్తారనీ, వాళ్ళందరి ముందూ, సిటీబస్‌లో వెళ్ళడం వల్ల రేగిన జుట్టూ, నలిగిన బట్టల్తో దేబ్య ముఖాల్లా వెళ్ళడం తనకిష్టం లేదు గాక లేదని ఖరాఖండీగా చెప్పేసింది.

అంతేకాదు— సినిమాకు వెళ్ళాలన్నా, తెలిసిన వాళ్ళింటికి వెళ్ళాలన్నా చివరికి మార్కెట్‌కు వెళ్ళాలన్నా ఈ స్కూటరే అడ్డొస్తోంది. ఈ విషయంలో ఇద్దరి మధ్యా సివిల్ వార్ మొదలయి క్రమంగా అది ఇరాక్ యుద్ధంగా పరిణమించింది కూడా. ఏదో ఒక సందర్భంగా పిల్లల వీపుల మీద దీపావళి ఆటంబాంబులూ, ముందు రూంలో ముఖ్యంగా తను పేపరు చదువుతున్నపుడు గరిటెలూ, చెంబుల రూపంలో స్కడ్ క్షిపణులూ పడుతున్నాయి. పరిస్థితి విషమిస్తోందని తెల్సినా బలవంతంగా రాజీనామా చేయాల్సొచ్చిన ముఖ్యమంత్రి లాగా ఏమీ చేయలేని స్థితి. పోనీలే— ఎలాగోలా కొందామంటే రూపాయికి వచ్చే మల్లె పూల దండా ఏమన్నానా? లేకపోతే ఎవరైనా గిఫ్ట్‌గా ఇస్తానంటే తానేమైనా పుచ్చుకోనంటున్నాడా?

అక్కడికీ ఓసారి సుగుణాకర్‌కి ఆ మాట అనే అవకాశం వచ్చింది. "లీలా వాళ్ళాయన వెహికిల్ కొన్నాడట. మధ్యాహ్నం ఇద్దరూ 'దాని' మీద వచ్చి వెళ్ళారు" ఈస్ట్‌మన్ కలర్‌లో వాళ్ళిద్దరూ వచ్చి వెళ్ళిన దృశ్యాన్ని ఊహించుకుంటూ చెప్పింది సుందరి ఓ రోజు.

సుందరి అక్కకు ఆడబడుచు లీల.

"ఆ! మరే! కట్నంతో బాటు వాళ్ళ మామగారు కొనిచ్చిందే ఆ స్కూటర్! అలా మా మామగారు కొనిస్తే నేనూ ఎంచక్కా కొనుక్కుందును." ముందుకు వంగుని ఎంతో ఉత్సాహంగా అన్నాడు సుగుణాకర్.

"అవును! నేనేగా — 'మాకు కానుకల రూపంలో ఏమీ ఇవ్వద్దు మామగారూ! అంతా కలిపి రొక్కం ఇచ్చేయ్యండని' అడుక్కుని ఆ డబ్బు మా చెల్లి పెళ్ళికి కట్నంగా ఇచ్చింది!" తప్పున జవాబిచ్చింది సుందరి.

అప్పుడే రంగేసిన బ్లాక్‌బోర్డు లాగ యుంది సుగుణాకర్ ముఖం.

ఇలాంటి సన్నివేశాలు రోజుకు కనీసం మూడు, నాలుగు జరుగుతున్న కొద్దీ ఇంటా బయటా తన పేరూ, గౌరవం, భయం, భక్తి లాంటివన్నీ రూపాయి విలువ లాగా రోజుకింత చొప్పున తరిగిపోతోందని తెలుసు కున్నాడు సుగుణాకర్. ఛీ! స్కూటర్ కొనని ఈ బ్రతుకు వృధా, వృధా అని గట్టిగా ఆరుసార్లు అనుకున్నాడు.


చివరికి ఆఫీసులో వెహికిల్స్ ఉ(కొ)న్న కొలీగ్స్‌ను అడిగితే సగం డబ్బు ఆఫీస్‌లో లోన్ దొరుకుతుందనీ, మిగతా సగం షాపులో ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కట్టొచ్చనీ వివరాలు చెప్పారు. ఏ వెహికిల్ కొనాలనే విషయం మీద కూడా నాలుగు రోజులు ఫిఫ్త్‌ఫ్లోర్‌లోని ఎకౌంట్స్ సెక్షన్‌లో తీవ్రాతి తీవ్ర చర్చలు జరిగాక చివరికి స్కూటర్ కొనాలనే నిశ్చయించు కున్నాడు సుగుణాకర్.

స్కూటర్ కొని ఇంటికి తీసుకెళ్ళేదాకా సుందరికి విషయం తెలియనీయవద్దని గట్టి నిర్ణయం తీసుకున్నాడు. ఆ మధ్య చూసిన ఓ సిన్మాలో హీరో ఇలాగే హీరోయిన్‌కు చెప్పకుండా కొనుక్కొచ్చిన మోటార్ సైకిల్ మీద ఆమె ఇంటి ముందు సడెన్‌గా దిగుతాడు. ఇక ఆ అమ్మాయి ఆ వెహికిల్ వెనకాల ఎక్కగానే ఇద్దరూ కలిసి బెంగుళూరు లాల్ బాగ్ నుంచి మైసూర్ బృందావన్ గార్డెన్స్ ద్వారా ఊటీ బొటానికల్ గార్డెన్స్ దాటేసి, కులూ మనాలీ చేరుకుంటారు. అలా సుందరి కూడా తనను

* *

**ఆఫీసులో ఇంకెవరైనా కొత్త వెహికిల్ కొని మేనేజర్ హృదయంలో సాఫ్ట్ కార్నర్ ఏర్పరచుకునే దాకా తనకు స్కూటర్‌కూ విముక్తి లేదని సుగుణాకర్ తొందరలోనే తెలుసుకున్నాడు. ఆఫీసు పనిమీద ...**

* *



వెహికిల్ మీద చూపి థ్రిల్ ఫీలయినట్టు కలలు కనసాగాడు సుగుణాకర్.

లోన్ సాంక్షన్ చేసిన ఆఫీసరుకు లంచం, ఐడియాలిచ్చిన మిత్రులకు పార్టీ వెరసి అప్పులో అప్పు అర్ధ మణుగు ఇంగువ అన్నట్టు రెండువేలు ఖర్చయింది సుగుణాకర్‌కు. పోనీలే అనుకున్న పని చేసాను అని సరిపెట్టుకున్నాడు.

"అరవై ఏడు... అరవై ఎనిమిది...అరవై తొమ్మి...."వరుసగా రోడ్డు మీద వెళ్తున్న ద్విచక్ర వాహనాలను లెక్కపెడ్తున్న సుందరి ఆగిపోయింది. అరవై తొమ్మిదో స్కూటర్ ఇంటి ముందు ఆగగానే.

దానిమీద నుండి దిగి స్టాండు వేసి, కళ్ళద్దాలు స్టైలుగా తీసి చేతిలో పట్టుకుని హీరో లెవెల్లో అడిగాడు సుగుణాకర్.

"హేవిటీ? హ్లా చూస్తున్నావ్? బావుందా?"

ఒక్క క్షణం ఆశ్చర్యపోయి అంతలోనే తేరుకుని అంది సుందరి దిగులుగా—"హు! బావుంటే మాత్రమేం లెండి! మనది కాకపోయిన తర్వాత!! మీ ఫ్రెండుది అడిగి తీసుకొచ్చారా? ప్రభాకర్ గారిది అయి వుంటుంది. అంతేనా?"

వంద రోజులాడుతుందనుకున్న పిచ్చి మా మొదటాటకే రష్ లేదని తెల్సిన నిర్మాత ముఖంలా అయింది సుగుణాకర్ ముఖం.

అయినా లేని నవ్వు ముఖానికి వెల్ల వేసుకున్నాడు.

"హి!హి! భలేదానివే— మనదే! అంటే మనమే— షాపుకెళ్ళి కొన్నామన్న మాట. ఎందుకంటే నువ్వు ఇరాక్ యుద్ధం— స్కడ్ క్షిపణులూ అవీ, ఇవీ అనీ, ఐ మీన్ నువ్వు... చాలా ఇష్టం— స్కూటర్ అంటే— కొందాం అనీ, ఇన్‌స్టాల్‌మెంటూ, లోనూ...పార్టీ..అదే — ఎలాగోలా అరేంజ్ చేసి కొన్నానన్న మాట. ఇక ఎక్కడికెళ్ళాలన్నా దీనిపైనే ...చూసావా? హౌమచ్ ఐ లవ్యూ?!" సంభాషణ ఎటో పోతోందని ఇంగ్లీష్ వాక్యంతో ఎండ్ చేసాడు.

మొత్తానికి కాస్సేపటికి విషయం అర్థమయింది సుందరికి.

"అయ్యో! మరి మొదటే చెప్పరేమిటండీ?" అంటూ పరిగెత్తుకెళ్ళి హారతి పట్టుకొచ్చింది.

పిల్లలు కేరింతలు కొడుతూ యథాశక్తి తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఆ తర్వాత స్కూటర్ ఎక్కడ వుంచాలనే ప్రాబ్లమ్ వచ్చింది. వాళ్ళుండేది మూడు గదుల అద్దె ఇల్లు చివరికి ముందు గదిలోనే అడ్జస్ట్ చేసారు. పిల్లలు దానిమీదే హోంవర్కు చేసుకుంటామని గొడవ చేసి, దాన్ని ముట్టుకోవద్దని సుందరి ఇచ్చిన అల్టిమేటమ్‌కు భయపడి ఊరుకున్నారు.

* * *

ఓ వారం రోజులు జగమే హాయీ, బ్రతుకే హాయీ అనుకుంటూ స్కూటర్ మీద తిరిగేశారు సుగుణాకర్ దంపతులు. ఈ లోగా రిజిస్ట్రేషన్, రైఫ్ టాక్స్, ఇన్సూరెన్సు ఇలా అన్నికలిపి వెయ్యి పైనే ఖర్చయ్యాయి సుగుణాకర్‌కి. ఈ వారం రోజులూ సినిమాలకూ, హోటళ్ళకూ మాత్రమే కాకుండా తెలిసిన వాళ్ళ దగ్గరికీ, బంధువుల ఇళ్ళకూ మరీమరీ గుర్తు పెట్టుకుని తీసుకెళ్ళింది సుందరి. జనాభా లెక్కల వాళ్ళలాగా ఇలా తిరగడం ఏ మాత్రం బావుండదన్నాడు సుగుణాకర్. చాలా బావుంటుదన్నది సుందరి.

వెళ్ళిన చోటల్లా తమ వెహికిల్ మిగతా వాటికన్నా ఎంత మంచిదో ఎంత కంసంప్షన్ ఇస్తుందో, దాని బెనిఫిట్స్ ఏమిటో సుందరి వివరిస్తుంటే ఆ కంపెనీ వాళ్ళు సుందరిని గానీ సేల్స్ ప్రమోటర్‌గా అప్పాయింట్ చేసుకుని

ఏమైనా పే చేస్తున్నారా అన్న అనుమానం వచ్చినా, తన భార్యకు గల వాహన విజ్ఞానానికి ఆనందించాడు సుగుణాకర్.

అప్పట్నుంచీ మొదలయ్యాయి అసలు కష్టాలు.

స్కూల్‌కు స్కూటర్ మీద వెళ్ళడమా రిక్షాలో వెళ్ళడమా అన్నది ప్రిస్టేజీ ఇష్యూగా తీసుకున్నారు పిల్లలు. సుందరి కూడా వాళ్ళ పక్షమే అవడంతో (వారానికి రెండుసార్లు మార్కెట్‌కు కూడా వెళ్ళాల్సి వుంటుంది కనుక) ఎనిమిదింటి దాకా పడుకునే సుగుణాకర్ తన నిద్రను హోల్‌సేల్‌గా త్యాగం చేయక తప్పలేదు. ఇదికాక బయటికి వెళ్ళినప్పుడల్లా పెట్రోలే కాక అదనపు ఖర్చులు తడిసి మోపెడయ్యాయి.

వీటికోసం డైలీ పేపరు, పిల్లలకు పళ్ళూ, బిస్కట్లూ, సుందరికి పూలూ లాంటి విషయాలకు బడ్జెట్‌లో కోత విధించక తప్పలేదు. చివరికి ఓ రోజు 'గల్ఫ్ క్రైసిస్ వల్ల పెట్రోల్ ధర హెచ్చింపు' అని పేపర్లో వచ్చిన వార్త సుగుణాకర్ గుండెల్లో సీమ టపాకాయలాగా పేలింది.

* * *

"సుగుణాకర్! అలా బయటికి వెళదాం వస్తారా?" మేనేజర్ తన సీటు దగ్గిరికి వచ్చి పిలిచేసరికి సాక్షాత్తూ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా పేవ్‌మెంట్ మీదున్న బిచ్చగాడి వద్దకు వచ్చినట్టు ఫీలయిపోయాడు సుగుణాకర్.

ఆఫీసులో మిగతా వాళ్ళంతా అతనికేసి జాలిగా చూస్తున్న చూపులను ఏమాత్రం పట్టించుకోలేదతను. పెంగ్విన్ పక్షిలాగా ఒక ప్రత్యేకమైన నడకతో మేనేజర్ వెనకాలే వెళ్ళాడు.

"తీయండి!" చేతులు వెనక్కు కట్టుకుని అన్నాడు మేనేజర్ బయటికి వెళ్ళాక.

"ఏమిటి సార్!" కిందంతా కలియజూసి జేబు రుమాలు, పెన్ను లాంటివేమీ లేవని నిర్ధారించుకుని అనుమానంగా అడిగాడు సుగుణాకర్.

"వెరీ ఇన్నొసెంట్ ఫెలో లాగున్నారే! మీ స్కూటర్ బయటికి తీయమంటున్నా! మనం ఇప్పుడు గోడౌన్ ఇన్‌స్పెక్షన్‌కు వెళ్ళాలి.

అర్థం చేసుకుని తూనీగలా లోపలికి పరిగెత్తాడు సుగుణాకర్ కీస్ తేవడానికి. అప్పటికే ఆఫీసులో 'వచ్చిందిరా గొర్రె' 'చిక్కిందిరా పిట్ట' 'పడ్డదిరా చేప' లాంటి మాటలేమిటో గందరగోళంగా మాట్లాడేసుకుంటున్నారందరూ.

అవన్నీ ఏ మాత్రం పట్టించుకోలేదు సుగుణాకర్. పాపం మేనేజర్‌కు కాలు ఫ్రాక్చర్ అయి కొంచెం హేండికాప్‌డ్ అయినప్పటి నుండీ వెహికిల్ నడపకూడదన్నారు కనుక ఏదో తనంటే ఆయన హృదయంలో సాఫ్ట్ కార్నర్ కాస్త ఎక్కువ వుంది కనుక తనను రమ్మంటున్నాడు అని అడ్జస్టయిపోయాడు.

ఆఫీసులోఇంకెవరైనా కొత్త వెహికిల్ కొని, మేనేజర్ హృదయంలో సాఫ్ట్ కార్నర్ ఏర్పరచుకునే దాకా తనకూ, స్కూటర్‌కూ విముక్తి లేదని సుగుణాకర్ తొందర్లోనే తెలుసుకున్నాడు. మేనేజర్ సుగుణాకర్‌ని ఆఫీసు పనిమీద తీసుకెళ్ళడం, అట్నుంచి అటే స్వంత పనులన్నిటికీ తిప్పడం అలవాటయింది. సుగుణాకర్‌కు పెట్రోలు నీళ్ళలాగా ఖర్చయిపోవడం కాకుండా మధ్యలో కాఫీలకూ, టిఫిన్లకూ బోలెడు డబ్బు ఖర్చయింది. ఎప్పుడయినా మేనేజర్ మాటవరుసకు పే చేస్తానన్నా, బాస్ కదా దేనికైనా అవసరమొస్తాడని సుగుణాకర్ తనే పే చేసేవాడు చచ్చినట్టు.

ఇదిలా వుండగా ఆఫీస్‌లో కూడా ఎన్నో మొహమాటాలు ఎదురయ్యాయి సుగుణాకర్‌కి.

"నా వెహికిల్ సర్వీసింగ్‌కు ఇచ్చానోయ్! ఒకసారి నీ స్కూటరిస్తే మళ్ళీ నువ్వు ఇంటికెళ్ళే టైమ్‌కి అప్పజెప్పేస్తాను" అంటూ మోహన్రావ్ ఓసారి తీస్కెళ్ళీ మొత్తం పెట్రోలంతా వాడేసి మాటైనా చెప్పకుండా తెచ్చి పెట్టాడు.



## ముద్దు

మొన్నామధ్య ఓ సినిమా చూసొచ్చారు దంపతులు. "లల్లీ! సినిమాలో చిరంజీవిని, మీనా ముద్దు పెట్టినట్లు పెట్టవా?" పడకపై సరసంగా అడిగాడు భర్త.

"అబ్బా... అలా పెట్టినందుకు షూటింగోళ్ళు మీనాకి బోలెడు డబ్బు లిస్తారట. నాక్కూడా యిస్తే పెడ్తా!" అంది భార్యామణి.

—ఉమాహరి

ఆ రోజు మధ్య దారిలో స్కూటర్ ఆగిపోతే మైలు దూరంలో వున్న పెట్రోల్ బంక్ దాకా లాక్కు రావాల్సి వచ్చింది సుగుణాకర్‌కి.

ఇంకోసారి వెంకటరెడ్డి వాళ్ళ ఆంటీ ఎవరో హాస్పిటల్‌లో అడ్మిట్ అయిందనీ (సింపతీ గ్రౌండ్స్ మీదైతే తొందరగా ఇస్తాడని) చూసొస్తాననీ సుగుణాకర్‌ని స్కూటర్ అడిగి తీసుకెళ్ళాడు. మళ్ళీ కీస్ ఇవ్వకుండా దొంగలాగా సుగుణాకర్ టేబుల్ డ్రాయర్‌లో పెట్టి వెళ్ళాడు.

సాయంత్రం స్కూటర్ చూసేసరికి సీట్లన్నీ చిరిగి వున్నాయి. ఇదేమిటని అడిగితే తను గెల్చిన నియోజక వర్గం ప్రజలు కలవడానికొస్తే ముఖం చాటేసే మంత్రిలాగా "సారీ గురూ! ఆ హాస్పిటల్ ముందు పార్కు చేస్తే ఎవరో పోకిరీ పిల్లలు బ్లేడుతో కోసినట్టున్నారు!" అనేసి జారుకున్నాడు.

మళ్ళీ కొత్త సీటు కవర్లు కుట్టించేసరికి తలప్రాణం తోకకొచ్చింది సుగుణాకర్‌కి. మరోసారి ఎదురింటి వెంకటేశ్వరరావు వాళ్ళబ్బాయి తప్పిపోతే వెతకడానికని (ఇది చైల్డ్ సెంటిమెంట్ కేస్) స్కూటర్ అడిగి తీసుకెళ్ళి ఓ రోజంతా తిరిగి టైరు పంక్చర్ చేసుకుని పట్టుకొచ్చాడు. (చివరికా అబ్బాయి ఎవరి కార్లోనో నిద్దరోతూ దొరికాడు)

లోను తీసుకోవడం వల్ల జీతం కట్ అయి తక్కువ రావడానికి తోడు ఇలాంటి ఖర్చులు ఎక్కువయి, సుగుణాకర్‌కు మనశ్శాంతి లేకుండా చేసాయి. దుఃఖం లేనివాడు గేదెను కొనుక్కోవాలన్న సామెత తన స్కూటర్‌కు వర్తిస్తుందనుకున్నాడతను. ఈ మధ్య టీవీలో టూవీలర్స్ అడ్వర్‌టైజ్ వచ్చినప్పుడల్లా అతను చిరాగ్గా దృష్టి మరల్చి ఇంటి కప్పుకేసో, టీపాయ్ మీదున్న ఫ్లవర్ వాజ్‌కేసో చూడడం సుందరి గమనిస్తూనే వుంది.

"స్కూటరేదీ?" ఆదివారం ఉదయాన్నే హేర్ కటింగ్‌కని 'నడచి' వెళ్ళి వచ్చిన సుగుణాకర్ సుందరి నడిగాడు.

"మరే..మన బాచీ వాళ్ళ ఫ్రెండ్సందరూ ఇవాళ సరదాగా వెహికిల్స్ మీద యాదగిరిగుట్టకు వెళ్దామని ప్లాన్ వేసుకున్నారట. అసలు వాడు రాత్రే మిమ్మల్ని అడుగుదామని మర్చిపోయాట్ట. మీరటు వెళ్ళగానే ఒకటే ఇదవుతుంటే ఽ: ఒక్కసారే కదాని నేనే... తీసుకెళ్ళమన్నాను" సుందరి చెప్పింది.

బాచి అనబడే భాస్కర్ సుందరికి తమ్ముడు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ విసుగు లేకుండా రాస్తూ, టైపు, కంప్యూటర్ కోర్సులు అనే సైడ్ హాబీలతో సిటీలైఫ్ గత రెణ్నెల్లుగా సుగుణాకర్ తిండితో ఎంజాయ్ చేస్తున్నవాడు.

"హు!" అని ఒక సుదీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు సుగుణాకర్ చేసేదేమీ లేక.

ఆ సాయంత్రానికి తిరిగొచ్చాడు బాచి చేతులకూ, మెడకూ, కట్లతో.

వీల్స్ పక్కకు తిరిగి, హేండిల్ వంగిపోయి, లైటు పగిలి, ముందు భాగం నజ్జునజ్జయి, ఓ ముద్ద లాగా మారిన స్కూటర్‌ను వెనకాలే ఓ రిక్షాలో వేసుకుని.

"చాలా పెద్ద గండం తప్పిందక్కా! అసలా లారీవాడూ.. నేననుకోవడం ఏమిటంటే ఓ ఇంటర్నేషనల్ క్రిమినల్ అనీ! అంతే.. లేకపోతే అలా సడెన్‌గా వచ్చి డాష్ ఇవ్వడు.. అయినా— మేమూరు కుంటామా? అయిదొందలు వసూల్ చేసాం. హాస్పిటల్ ఖర్చులు సరిపోయాయిలే! అవునూ బావ తిడ్తాడేమో...ఇంట్లోనే ఉన్నాడా?" లోపలికి తొంగి చూసాడు బాచి.

గుండె చిక్కబట్టుకుని భయం భయంగా లోపలికి తొంగిచూసిన సుందరికి 'జీవితాంతం మీకు తోడు— మీ కుటుంబపు సైకిల్— నేడే కొనండి! టింగ్— టింగ్" అంటూ వస్తున్న సైకిల్ అడ్వర్‌టైజ్‌మెంట్‌ను అత్యంత దీక్షగానూ, గొప్ప రిలీఫ్‌తోనూ చూస్తున్న సుగుణాకర్ కన్పించాడు.

*

